## బీజేపీది ఆర్థిక ఉగ్రవాదం

**తృణమూల్ కాంగ్రెస్ ఆగ్రహం**

కోల్‌కతా, ఫిబ్రవరి 4: తృణమూల్‌ను రాజకీయంగా ఎదుర్కొనలేక.. కేంద్రంలోని బీజేపీ ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడుతున్నదని టీఎంసీ (తృణమూల్) ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ అన్నారు. కేంద్ర నిధుల వినియోగానికి సంబంధించి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 'యుటిలైజేషన్ సర్టిఫికెట్స్' సమర్పించటం లేదన్న బీజేపీ నేతల ఆరోపణల్ని ఆయన కొట్టిపారేశారు. బీజేపీయేతర ప్రభుత్వం ఏ రాష్ట్రంలో ఉన్నా.. దానిని కేంద్రం టార్గెట్ చేస్తున్నదని ఆరోపించారు. ఆదివారం కోల్‌కతాలో ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ విలేకరులతో మాట్లాడుతూ, 'రాజకీయంగా తృణమూల్‌ను ఓడించలేక, రాష్ట్రంలోని పేద ప్రజలపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు దిగింది. కాగ్ నివేదిక ప్రకటనలను విపక్షాలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నాయి. వామపక్షాల పాలనలో వైఫల్యాలకు తృణమూల్ బాధ్యత వహించదు. తృణమూల్ ప్రభుత్వం ప్రొటోకాల్ ప్రకారం వెళ్లింది' అని చెప్పారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు వేల కోట్ల రూపాయల యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ సమర్పించలేదని తృణమూల్ మరో నేత కాకోలి ఘోష్ దస్తిదార్ గుర్తుచేశారు. రాష్ట్రానికి ఉపాధి హామీ నిధులు విడుదల కావటం లేదని 2022 మే నుంచి కేంద్రానికి ఫిర్యాదు చేస్తున్నామని ఆమె చెప్పారు.

### యూఏఈలో భారతీయుడికి 33 కోట్ల లాటరీ

అబుదాబి, ఫిబ్రవరి 4: ప్రవాస భారతీయుడికి అబుదాబిలో రూ.33.89 కోట్ల బంపర్ లాటరీ తగిలింది. రాజీవ్ ఆరిక్కట్ అనే ఎన్నారై కొనుగోలు చేసిన బిగ్ టికెట్ నంబర్ వీక్లీ డ్రాలో విజేతగా నిలిచింది. అల్ ఐన్ నగరంలో నివసించే రాజీవ్ అర్కిటెక్చర్. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడేండ్లుగా బిగ్ టికెట్ కొనుగోలు చేస్తున్న రాజీవ్‌ను ఈ సారి అదృష్టం వరించింది. 'నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్న. ఇంతపెద్ద గ్రాండ్ ప్రైజ్ వస్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. ఇది ఒక కలగా ఉన్నది' అని బిగ్ టికెట్ నిర్వాహకులతో రాజీవ్ పేర్కొన్నారు.

### 2 నిమిషాల్లో కంపెనీ ఖాళీ

**ఫ్రంట్‌డెస్క్‌లో మొత్తం 200 మంది ఉద్యోగుల తొలగింపు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 : టెక్ కంపెనీల్లో ఉద్యోగాలు ఎప్పుడు ఊడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. తాజాగా ఓ కంపెనీలో ఉద్యోగులందర్నీ రెండు నిమిషాల్లో తొలగించారు. అమెరికాకు చెందిన టెక్ కంపెనీ 'ఫ్రంట్‌డెస్క్' సీఈవో.. కేవలం రెండు నిమిషాల గూగుల్‌మీట్ కాల్‌తో కంపెనీలోని మొత్తం 200మంది ఉద్యోగులను తొలగించారు. దివాలా తీసిన కంపెనీగా ముద్ర పడకుండా కంపెనీ యాజమాన్యం ఈ చర్యను చేపట్టినట్టు తెలిసింది. ఈ ఏడాది జనవరిలో ప్రఖ్యాత టెక్ కంపెనీల్లో భారీ ఎత్తున లేఆఫ్స్ ప్రకటిస్తుండటం ఈ రంగంలో ఉద్యోగుల్ని ఆందోళనకు గురిచేస్తున్నది.




### ఇండియన్ ఎంబసీలో పాక్ గూఢచారి

**అరెస్ట్ చేసిన యూపీ ఏటీఎస్**

లక్నో, ఫిబ్రవరి 4: డబ్బుకు లొంగిపోయిన ఓ భారతీయ ఉద్యోగి దాయాది దేశం పాకిస్థాన్‌కు తొత్తుగా మారాడు. రక్షణ వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి చేరవేస్తూ అడ్డంగా దొరికాడు. ఉత్తరప్రదేశ్ హర్పూర్‌లోని షామాహియుద్దీన్‌పూర్‌కు చెందిన సతేంద్ర సివాల్ 2021 నుంచి మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ఇండియా బేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్ (ఐబీఎస్ఏ)గా పనిచేస్తున్నాడు. అతడి కదలికలను అనుమానించిన అధికారులు ఎలక్ట్రానిక్, భౌతిక నిఘా పెట్టారు. పాక్ ఐఎస్ఐకి కీలక సమాచారం అందిస్తున్నట్టు గుర్తించిన ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) తాజాగా అతడిని అరెస్ట్ చేసింది. విచారణలో అతడు నేరాన్ని అంగీకరించాడని పేర్కొంది. లక్నోలోని ఏటీఎస్ పోలీస్ స్టేషన్‌లో అతడిపై ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత అరెస్ట్ చేసినట్టు వివరించింది. సతేంద్ర సివాల్ డబ్బులకు కక్కుర్తిపడి రక్షణ, విదేశాంగశాఖ, మిలటరీ కార్యకలాపాలకు సంబంధించిన వ్యూహాత్మక కార్యకలాపాల రహస్య సమాచారాన్ని ఐఎస్ఐకి చేరవేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## అమెరికాలో ప్రమాదకర వైరస్ వ్యాప్తి

**వేగంగా విస్తరిస్తున్న 'క్యాండిడా ఆరిస్'**



వాషింగ్టన్: అత్యంత ప్రమాదకర ఫంగల్ వైరస్ 'క్యాండిడా ఆరిస్' అమెరికాలో వేగంగా విస్తరిస్తున్నది. వాషింగ్టన్‌లో చాలామంది ఈ వైరస్‌బారిన పడ్డారని వార్తలు వెలువడ్డాయి. కొత్త వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇక్కడి వైద్యులు హెచ్చరిస్తున్నారు. దవాఖానాల్లో వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకుతున్నదని, శక్తివంతమైన యాంటీఫంగల్ ఔషధాల్ని సైతం వైరస్ తట్టుకుంటున్నదని వైద్యులు తెలిపారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) సమాచారం ప్రకారం, అమెరికాలో 'క్యాండిడా ఆరిస్' తొలి కేసు ఈ ఏడాది జనవరి 10న నమోదైంది. వైరస్‌బారిన పడ్డవాళ్లలో ఇన్‌ఫెక్షన్స్ ఎక్కువగా ఉంటున్నాయి. వైరస్ సోకిందని తెలిపే.. ప్రత్యేక లక్షణాలేవీ బయటకు కనపడటం లేదు. 'క్యాండిడా ఆరిస్' వైరస్‌ను మొదటిసారి 15 ఏండ్ల క్రితం జపాన్‌లో గుర్తించారు. తాజాగా అమెరికా సహా 40 దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి చెందుతున్నదని డబ్ల్యూహెచ్‌వో ఆందోళన వ్యక్తం చేసింది.

## క్యాన్సర్‌కూ వ్యాక్సిన్!

**బ్రిటన్‌లో రోగులపై క్లినికల్ ట్రయల్స్**


(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): క్యాన్సర్‌ను నయం చేసే వ్యాక్సిన్‌ను బ్రిటన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కరోనా వ్యాక్సిన్ తయారీలో ఉపయోగించిన మెసెంజర్ ఆర్ఎన్ఏ(mRNA) సాంకేతికతనే ఇందులోనూ వినియోగించారు. గ్లోబల్ ట్రయల్స్‌లో భాగంగా బ్రిటన్‌లో క్యాన్సర్ రోగులపై ఈ వ్యాక్సిన్‌ను ప్రయోగించి మంచి ఫలితాలను సాధించినట్టు లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ పరిశోధకులు వెల్లడించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, చర్మ క్యాన్సర్, ఇతర ఘన కణితుల క్యాన్సర్‌లకు వ్యతిరేకంగా వ్యాక్సిన్ సామర్థ్యం, సురక్షితను అధ్యయనం చేస్తున్నట్టు పరిశోధకులు వెల్లడించారు. ఎంఆర్ఎన్ఏ-4359 పేరుతో పిలవబడే ఈ టీకాను చర్మ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ 81 ఏండ్ల వ్యక్తికి ఇవ్వగా.. సత్ఫలితాలు వచ్చినట్టు ప్రకటించారు. ఈ ప్రయోగ ఫలితాలు, భవిష్యత్‌లో క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పును తీసుకురాబోతున్నట్లు పరిశోధకులు ప్రకటించారు. ఈ కొత్త టీకా క్యాన్సర్ రోగి శరీరంలోని సొంత రోగ నిరోధక వ్యవస్థను మెరుగు పరచడం వల్ల రక్షణ వ్యవస్థ మరింత బాగా పని చేస్తుందన్నారు.

## కర్ణాటకను వణికిస్తున్న మంకీ ఫీవర్

**ఇద్దరు మృతి.. అధికారులు అప్రమత్తం**

బెంగళూరు: కర్ణాటకను మంకీ ఫీవర్ వణికిస్తున్నది. ఇద్దరు మరణించడంతో రాష్ట్ర ఆరోగ్య శాఖాధికారులు అప్రమత్తమయ్యారు. ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన చర్యలపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఈ వ్యాధి వల్ల మొదటి మరణం జనవరి 8న శివమొగ్గ జిల్లా, హోసనగర్ తాలూకాలో సంభవించింది. 18 ఏండ్ల బాలిక ఈ వ్యాధితో ప్రాణాలు కోల్పోయింది. ఈ వ్యాధి కారణంగా మరణించిన రెండో వ్యక్తి ఉడుపి జిల్లాకు చెందిన 79 ఏండ్ల వృద్ధుడు.



ఇప్పటి వరకు రాష్ట్రంలో 49 పాజిటివ్ కేసులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఉత్తర కన్నడలో 34 మంది, శివమొగ్గలో 12 మంది, చిక్కమగళూరులో ముగ్గురు ఈ వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు.

# జర్నలిజం.. ఏది నిజం?

*బ్రేకింగ్.. బిగ్ బ్రేకింగ్.. తాజా వార్త.. సంచలన వార్త.. జర్నలిజానికి పట్టిన జబ్బులివి! ఈ వ్యామోహంలో ఏది పడితే అది రాసి ప్రచారం చేయటంతో ప్రజల్లో జర్నలిజానికి ఉన్న విశ్వసనీయత దెబ్బతింటున్నది. అందుకు సోషల్ మీడియా కూడా దోహదం చేస్తున్నది. ఆధార రుజువు లేని ఆ పోస్టులకు వంత పాడుతూ అదే దారిలో పయనిస్తూ వార్తాపత్రికలు, చానళ్లు దెబ్బతింటున్నాయి. 'మేమే ముందు బ్రేకింగ్ ఇచ్చాం' అన్న మోజు.. తప్పులకు రివాజు అవుతున్నది.*

## స్మార్ట్‌యుగంలో ఫ్యాక్ట్‌చెక్ ఎక్కడ?

### 'పూనమ్ పాండే' ఘటన వేకప్ కాల్

### కండ్లు తెరిపించిన ఒక ఇన్సిడెంట్



'గర్భాశయ క్యాన్సర్‌తో పూనమ్ పాండే మృతి.. కాదు కాదు అంతా తూచ్'.. ఈ ఒక్క వార్త దేశ జర్నలిస్టులు, ప్రజా సంబంధాల (పీఆర్) బృందాలను ఉలిక్కిపడేలా చేసింది. నిక్కచ్చిగా చెప్పాలంటే.. మూసుకుపోయిన జర్నలిజం కండ్లను తెరిపించింది. యస్! సోషల్ మీడియా ఉచ్చులో పడి కొట్టుమిట్టాడుతున్న వార్తాపత్రికలు, న్యూస్ చానెళ్లను అలర్ట్ చేసింది. 'ఏది నిజం?, వాస్తవ పరిస్థితులు, ప్రజాహిత సమాచారం' లాంటివి లేకుండానే జర్నలిజం కొనసాగుతున్న రోజులివి. ఒక వదంతి, అబద్ధం కాదు.. ఒక వాదన, నిజం కాదు.. ఒక ఆరోపణ, తీర్పు కాదు.. అన్న విషయాలు మరిచిపోతున్నందునే 'పూనమ్ పాండే' లాంటి ఘటనలు జర్నలిజానికి సవాలు విసురుతున్నాయి. నిజం గడప దాటేలోపు అబద్ధం ఊరంతా తిరిగి వస్తున్నదన్న నానుడిని గుర్తుచేస్తూ ఒక తప్పుడు సమాచారం ఒక వార్తగా మారి అదే నిజమనేలా చేస్తున్నది.

**పూనమ్‌కు ఇదే మొదటిది కాదు**

వార్తల్లో నిలవాలి.. తానే వార్త కావాలి.. అందరూ తననే చూడాలి.. అన్న తాపత్రయం పూనమ్‌పాండేది. అందులో భాగమే ఆమె చేష్టలు. ఆ చేష్టలు ఏ స్థాయిలో ఉన్నాయంటే.. గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కోసం తననే చంపేసుకున్నంతగా! తన పీఆర్ బృందమే సోషల్ మీడియాలో పోస్ట్ చేయటంతో అంతా నమ్మారు. అంతకుముందు 2011 క్రికెట్ వరల్డ్ కప్ సందర్భంలోనూ 'న్యూడ్' కామెంట్లు చేసి వార్తల్లో నిలిచింది. భారత్ వరల్డ్‌కప్ గెలిస్తే న్యూడ్ షో చేస్తానని ట్రిక్ ప్లే చేసి మీడియాను తనవైపు తిప్పుకుంది. భారత్ కప్ గెలవగానే సైలెంట్ అయిపోయింది. ఇక్కడ ఆమె ఏం చేసింది? అన్నది ముఖ్యం కాదు. ఆమె చర్యలకు మీడియా ఎలాంటి ప్రాధాన్యం ఇస్తున్నది అన్నదే ప్రధానం. ఆమె గిమ్మిక్కులకు నెటిజన్లు తిట్టిపోశారు. కానీ, జర్నలిస్టులు చనిపోయిందని ఆధారాలు సేకరించారా? పీఆర్ టీం ప్రకటించగానే దాన్ని నిజం అని ఎలా పరిగణించారు? అన్నవి ప్రశ్నలు. ఆ ప్రకటనపై ఫ్యాక్ట్ చెక్ లేకపోవటమే ప్రజల్లో మీడియాను చులకన చేస్తున్నది.

**డిజిటల్ మార్కెటింగ్ కమ్మేస్తున్నా..**

ప్రస్తుతం అంతా సోషల్ మీడియాదే హవా. డిజిటల్ మార్కెటింగ్‌తో పోటీ పడాలన్న తాపత్రయమే వార్తాచానళ్లు, పత్రికలకు ప్రమాదకరంగా మారింది. ఒక వార్త చానళ్లలో, పేపర్లలో వచ్చే సరికే డిజిటల్ మీడియా ప్రపంచవ్యాప్తం చేస్తున్నది. కానీ, ఇక్కడ సోషల్ మీడియా ప్రచారం చేసే ప్రతి వార్త నిజం కాదు.

**టీఆర్పీ, సర్క్యులేషన్ కోసం..**

ఫేక్ వార్తలను వండి వార్చి బ్రేకింగ్‌లా ఇచ్చి.. టీఆర్పీ, సర్క్యులేషన్ పెంచుకొనే మోజులో జర్నలిజం పక్కదారి పడుతున్నది. నిజానిజాలు తెలుసుకోకుండా, ప్రముఖులకు సంబంధించిన ఏదేని అంశం దొరికిందే తడవుగా మీడియా సంస్థలు గాలి వార్తలను సైతం పబ్లిష్ చేస్తున్నాయి. ఇక, సోషల్ మీడియాలో వచ్చిన వాటిని పబ్లిష్ చేస్తూ విశ్వసనీయతను కోల్పోతున్నాయి. విశ్వసనీయ పత్రికల్లో వచ్చినా ప్రజలు నమ్మలేని పరిస్థితులు దాపురిస్తున్నాయి. దానికి తాజా ఉదాహరణే పూనం పాండే ఘటన. గర్భాశయ క్యాన్సర్ కోసం వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపడతామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించటం.. ఆ మరుసటిరోజే పూనమ్ పాండే అదే వ్యాధితో మరణించిందని వార్త రావటంతో వార్తాచానళ్లు, వార్తాపత్రికలు బ్రేకింగ్, హైలైట్ చేశాయి.

**ఇదే వేకప్ కాల్**

ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికా లాంటి దేశాలకు ఫేక్ న్యూస్ గుదిబండలా మారుతున్నది. కొన్ని బిజినెస్ సంస్థలు, రాజకీయ పార్టీలు తప్పుడు సమాచారాన్ని వదులుతున్నాయి. ఇక్కడ పూనమ్ పాండే ఘటనకు ప్రాధాన్యం చిన్నదే కావొచ్చు. కానీ, భారీ విపత్తుకు దారి తీసే తప్పుడు సమాచారం ప్రజల్లోకి చొచ్చుకుపోతే? అందుకే జర్నలిస్టు బాధ్యత జాతిని జాగృతం చేసేలా ఉండాలి. జర్నలిస్టు విధి ఫ్యాక్ట్ చెక్‌తో ముడిపడి ఉండాలి.

*- సెంట్రల్ డెస్క్*

## బీజేపీలో చేరాలని ఒత్తిళ్లు!

- చేరితే ఇబ్బంది పెట్టబోరట
- కేసులు పెట్టకుండా వదిలేస్తారట
- కానీ వాళ్లకు తలొంచే ప్రసక్తే లేదు
- ఎప్పటికీ బీజేపీలో చేరేది లేదు
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బీజేపీలో చేరితో నన్ను ఇబ్బంది పెట్టబోమని కమలం పార్టీ నాయకులు తనకు ఆహ్వానం పలికారని, కానీ తాను నిర్ద్వంద్వంగా తిరస్కరించానని ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. 'వారు (బీజేపీ) ఏం చేయాలనుకుంటే చేసుకోనీ.. ఏమీ కాదు. నేను వారికి లొంగే ప్రశ్నే లేదు' అని స్పష్టంచేశారు. ఢిల్లీలో రోహిణిలో ఆదివారం ఓ పాఠశాల భవనం ప్రారంభోత్సవం సందర్భంగా కేజ్రీవాల్ ప్రసంగించారు. ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ నేతలు ఫిరాయింపులకు ప్రోత్సహించారంటూ చేసిన ఆరోపణలపై పోలీసులు కేజ్రీవాల్‌కు, మంత్రి ఆతిశీకి నోటీసులు ఇచ్చారు. వారు చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలను మూడు రోజుల్లోగా అందజేయాలని చెప్పారు. దీనిపై కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు. తాము స్కూళ్లు, దవాఖానలు, క్లినిక్‌లు, రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, ఇది తప్పా? అని ప్రశ్నించారు. ఒక్కో ఎమ్మెల్యేకు 25 కోట్లు, వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇస్తామంటూ బీజేపీ నేతలు ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేశారని కేజ్రీవాల్ గత నెల 27న ఆరోపించారు. ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేయడం శిక్షించదగిన నేరం కాబట్టి, మీ దగ్గరున్న సమాచారాన్ని ఈ నెల 5లోగా అందజేయండి అని కోరుతూ ఢిల్లీ పోలీసులు కేజ్రీవాల్‌కు నోటీసులిచ్చారు.

**నేను జైలుకు పోయినా అభివృద్ధి ఆగదు**

తనను జైలుకు పంపినా ప్రజల కోసం తాము చేపట్టిన అభివృద్ధి పనులు ఆగబోవని కేజ్రీవాల్ స్పష్టంచేశారు. స్కూళ్లు కట్టినందుకే సిసోడియాను జైలులో పెట్టారని చెప్పారు. మొహల్లా దవాఖానలు కట్టినందుకే సత్యేందర్ జైన్‌ను జైలులో పెట్టారని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను కూడా జైలులో పెట్టినా అభివృద్ధి పనులు ఆగబోవని స్పష్టం చేశారు.

## యూసీసీ ముసాయిదాకు ఉత్తరాఖండ్ క్యాబినెట్ ఆమోదం

డెహ్రాడూన్: ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ముసాయిదాను ఉత్తరాఖండ్ క్యాబినెట్ ఆదివారం ఆమోదించింది. దీంతో ఈ బిల్లును సోమవారం నుంచి జరిగే శాసన సభ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమం అయింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీ యూసీసీ నివేదికను సీఎం పుష్కర్‌సింగ్ ధామికి శుక్రవారం సమర్పించింది. దీనిని ఆమోదించేందుకే శాసనసభ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారు.

## కాంగ్రెస్ క్యాంపు రాజకీయాలకు అడ్డాగా తెలంగాణ

- ఉదయం రాంచీకి తిరిగి వెళ్లిన జార్ఖండ్ ఎమ్మెల్యేలు
- రాత్రి హైదరాబాద్ వచ్చిన బీహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- ఆయా రాష్ట్రాల్లో రాజకీయ సంక్షోభంతో ఎమ్మెల్యేలను కాపాడుకునే పనిలో కాంగ్రెస్
- ఇక్కడ అధికారం ఉండడంతో ఎమ్మెల్యేల తరలింపు
- అన్నీ తానై చూసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ క్యాంపు రాజకీయాలకు తెలంగాణ అడ్డాగా మారింది. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలిస్తున్నది. రెండ్రోజుల క్యాంపును పూర్తి చేసుకొన్న జార్ఖండ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం ఉదయమే తిరిగి వెళ్లిపోయారు. వాళ్లు అలా వెళ్లారో లేదో రాత్రికి బీహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో దిగిపోయారు. బీహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ కూటమికి గుడ్‌బై చెప్పిన జేడీయూ అధినేత నితీశ్‌కుమార్.. బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈ నెల 12న నితీశ్ ప్రభుత్వానికి బలపరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, ఆర్జేడీ తమ ఎమ్మెల్యేలను కాపాడుకునే పనిలో పడ్డాయి. జార్ఖండ్‌లోనూ రాజకీయ సంక్షోభం తలెత్తడంతో జేఎంఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆ పార్టీ రెండ్రోజులుగా నగరంలోని లియోనియో రిసార్ట్‌లో ఉంచింది. మంగళవారం జేఎంఎం-కాంగ్రెస్ ప్రభుత్వ బలపరీక్ష ఉండడంతో ఎమ్మెల్యేలను ఆ పార్టీ ప్రత్యేక విమానంలో ఆదివారం రాంచీకి తరలించింది.

**హైదరాబాద్‌కే ఎందుకు?**

ఆయా రాష్ట్రాల్లో రాజకీయ సంక్షోభం తలెత్తుతుండడంతో కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలిస్తున్నది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటమే కారణం. జార్ఖండ్ ఎమ్మెల్యేలను కాపాడేందుకు పార్టీ నుంచి మల్‌రెడ్డి రాంరెడ్డి, సంపత్‌కుమార్, ఇతర నేతలకు బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో క్యాంపు ఎమ్మెల్యేలపై నిఘా పెడుతున్నది. కాంగ్రెస్ హైదరాబాద్‌ను క్యాంప్‌లకు కేరాఫ్‌గా మార్చిందనే విమర్శలు వస్తున్నాయి.

# చంపయీకి బలపరీక్ష

- అసెంబ్లీలో నేడే విశ్వాస పరీక్ష
- జేఎంఎం ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యే హెమ్‌బ్రోమ్ విమర్శలు
- టచ్‌లో లేని మరో జేఎంఎం ఎమ్మెల్యే
- అధికార కూటమిలో కలవరం
- ఉత్కంఠగా జార్ఖండ్ రాజకీయం



న్యూఢిల్లీ/రాంచీ, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి పదవికి హేమంత్ సొరేన్ రాజీనామా తర్వాత జార్ఖండ్‌లో జేఎంఎం నేత చంపయీ సొరేన్ నేతృత్వంలో ఏర్పాటైన కొత్త సంకీర్ణ ప్రభుత్వం అసెంబ్లీలో సోమవారం బలపరీక్షను ఎదుర్కోనున్నది. బలపరీక్ష నెగ్గడం అధికార కూటమికి అంత సులువుగా కనిపించడం లేదు. బలపరీక్ష జరుగనున్న 24 గంటల ముందు జేఎంఎం పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే పార్టీకి, మాజీ సీఎం హేమంత్ సొరేన్‌కు వ్యతిరేకంగా గళం విప్పడం.. మరో ఎమ్మెల్యే టచ్‌లో లేకుండా పోవడం సంకీర్ణ ప్రభుత్వాన్ని కలవరపరుస్తున్నది. 81 స్థానాలు ఉండే జార్ఖండ్ అసెంబ్లీలో మెజార్టీకి అవసరమైన 41 కంటే ఎక్కువగానే తమకు 43 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నదని, ఆ సంఖ్య 46-47 వరకు చేరుకొంటుందని సీఎం చంపయీ సొరేన్‌తో సహా అధికార పక్ష నేతలు ధీమాగా ఉన్నారు. అయితే కూటమిలోని ఎమ్మెల్యేలు అందరూ సోమవారం జరిగే బలపరీక్షలో ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేస్తే సరే.. లేకుంటే సర్కార్ ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**హైదరాబాద్ టు రాంచీ..**

బీజేపీ ప్రలోభాల భయంతో గత శుక్రవారం హైదరాబాద్‌కు తరలించిన దాదాపు 40 మంది జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలు బలపరీక్ష నేపథ్యంలో ఆదివారం తిరిగి రాంచీకి బయలుదేరి వెళ్లారు. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం జేఎంఎం నేతృత్వంలోని అధికార సంకీర్ణ కూటమికి 46 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నది. జేఎంఎంకు 28 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 16, ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్) పార్టీకి ఒక్కరు చొప్పున ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రతిపక్ష బీజేపీ, దాని మిత్రపక్ష పార్టీలకు కలిపి 29 మంది శాసనసభ్యులు ఉన్నారు. అయితే ఇద్దరు జేఎంఎం ఎమ్మెల్యేలు పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారని, వీరు ఓటింగ్‌కు గైర్హాజరయ్యే అవకాశం ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది.

**ఓటింగ్‌కు గైర్హాజరు అయితే..**

జేఎంఎం ఎమ్మెల్యే లోబిన్ హెమ్‌బ్రోమ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గత హేమంత్ సొరేన్ సర్కార్‌పై విమర్శలు గుప్పించడం సంచలనంగా మారింది. తన సలహాను విస్మరించినందుకే హేమంత్‌కు ఈ పరిస్థితి(అరెస్టు) ఏర్పడిందని విమర్శించారు. చోటా నాగ్‌పుర్ అద్దె చట్టం, సంథాల్ పరగణాల అద్దె చట్టం తీసుకొస్తామని జేఎంఎం 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని, అయితే అవి అమలు కాలేదని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టులు, డ్యామ్‌లు, పరిశ్రమల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల భూములను గుంజుకొన్నదని ఆరోపించారు. హెమ్‌బ్రోమ్‌తో తాము మాట్లాడామని, ఆయన సోమవారం జరిగే బలపరీక్షకు హాజరవుతారని జేఎంఎం నేత సుప్రియో భట్టాచార్య తెలిపారు. మరోవైపు బిషున్‌పూర్ ఎమ్మెల్యే చంమ్రా లిండా కూడా ఇప్పటి వరకు టచ్‌లోకి రానట్టు తెలుస్తున్నది. లిండా అనారోగ్యంగా ఉన్నారని జేఎంఎం నేతలు చెబుతున్నప్పటికీ, ఆయన గతంలో జేఎంఎం ప్రభుత్వంపై విమర్శలు చేశారు.



### ట్రాఫిక్ నరకం.. బెంగళూరు ప్రథమం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో కర్ణాటక రాజధాని బెంగళూరు దేశంలోనే మొదటి స్థానంలో.. ప్రపంచంలో ఆరో స్థానంలో ఉన్నది. ఆ తర్వాత పుణెలో భారీగా ట్రాఫిక్ ఉంటున్నదని ఆమ్‌స్టర్‌డామ్ కేంద్రంగా పనిచేసే లొకేషన్ టెక్నాలజీ సంస్థ టామ్‌టామ్ వెల్లడించింది. ప్రపంచంలోకెల్లా అత్యంత ట్రాఫిక్ ఉండే నగరం లండన్ అని, ఇక్కడ 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటు సమయం 37 నిమిషాల 20 సెకండ్లు పడుతుందని పేర్కొన్నది. నివేదిక ప్రకారం బెంగళూరు, పుణెల్లో ఈ ప్రయాణ సమయం వరుసగా 28 నిమిషాల 10 సెకండ్లు, 27 నిమిషాల 50 సెకండ్లుగా ఉన్నది. అదేవిధంగా అత్యంత రద్దీ నగరాల్లో ఐర్లాండ్ రాజధాని డబ్లిన్ తర్వాత బెంగళూరు రెండో స్థానంలో ఉన్నది.



### తొలి త్రీడీ ప్రింటెడ్ మెదడు కణజాలం

వాషింగ్టన్: ప్రపంచంలోనే తొలి త్రీడీ ప్రింటెడ్ బ్రెయిన్ కణజాలాన్ని అమెరికా సైంటిస్టులు ఆవిష్కరించారు. ఇది మనిషి మెదడులోని సహజ కణజాలం లాగా పని చేయగలదని 'న్యూరోసైన్స్' జర్నల్ తాజా కథనం పేర్కొన్నది. కృత్రిమంగా తయారు చేసిన 'త్రీడీ ప్రింటెడ్ బ్రెయిన్ టిష్యూ' నాడీ సంబంధిత సమస్యల పరిష్కారంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని పరిశోధకులు చెబుతున్నారు. పార్కిన్సన్, అల్జీమర్స్ వ్యాధి చికిత్సలో సైంటిస్టుల పరిశోధనకు ఇదెంతగానో దోహదపడుతుందని తెలిపారు. మానవ మెదడులో కణజాలం పనితీరును అర్థం చేసుకోవటంలో ఇది శక్తివంతమైన మోడల్ అవుతుందని పరిశోధకులు తెలిపారు.



## వరుడు లేకుండానే పెండ్లి!

**యూపీలో సామూహిక వివాహాల స్కామ్.. కిరాయి జంటలకు 500-2000 చెల్లింపు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఉత్తరప్రదేశ్‌లో ఘరానా మోసం బయటపడింది. సామూహిక వివాహాల పథకం కింద ప్రభుత్వం అందజేసే సొమ్మును కాజేసేందుకు కేటుగాళ్లు నకిలీ పెండ్లిండ్లు నిర్వహించారు. వరుడు లేకుండానే వందలాది మహిళలు ఎవరికి వారు మెడలో దండలు వేసుకొని పెండ్లి తంతు మమ అనిపించడం ఒక ఎత్తు అయితే.. రూ.500-రూ.2000 ఇచ్చి కిరాయికి తీసుకొచ్చిన వారిని ఈ కార్యక్రమంలో కూర్చొబెట్టడం మరో ఎత్తు. గత నెల 25న బలియా జిల్లాలో జరిగిన సామూహిక వివాహ కార్యక్రమంలో జరిగిన ఈ స్కామ్‌ను చూపే వీడియో వైరల్‌గా మారింది. ఈ కుంభకోణానికి సంబంధించి ఇద్దరు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సహా మొత్తం 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ రోజున కార్యక్రమంలో భాగంగా 568 జంటలకు పెండ్లిండ్లు జరుగ్గా.. అందులో దాదాపు 200 జంటలు నకిలీ అని తేలినట్టు అధికారులు వెల్లడించారు. వీరిలో కొంత మంది గతంలో పెండ్లి చేసుకొన్నవారు, పిల్లలున్న తల్లిదండ్రులు కూడా ఉన్నారని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే కేత్కి సింగ్ ముఖ్య అతిథిగా హాజరు కావడం గమనార్హం.యూపీలో సామూహిక వివాహాలు చేసుకొన్న జంటలకు ప్రభుత్వం రూ.51 వేల ఆర్థిక సాయం అందిస్తున్నది.



### సంపదలో బిల్‌గేట్స్‌ను దాటిన జుకర్‌బర్గ్

న్యూయార్క్: ప్రపంచ సంపన్నుల జాబితాలో మెటా సీఈవో, సహ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ దూసుకెళ్తున్నారు. ఫోర్బ్స్ తాజా అంచనాల ప్రకారం, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ఇన్వెస్టర్ బిల్‌గేట్స్‌ను వెనక్కినెట్టాడు. ప్రపంచ కుబేరుల్లో బెర్నార్డ్ ఆర్నాల్ట్, ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్ తర్వాత నాలుగో స్థానంలో మార్క్ జుకర్‌బర్గ్ నిలిచారు. స్టాక్‌మార్కెట్‌లో మెటా షేర్ల ధరలు అమాంతం (22%) పెరగటంతో ఆయన సంపద విలువ 28 బిలియన్ డాలర్ల (రూ.2.3 లక్షల కోట్లు) మేర పెరిగింది. దీంతో జుకర్‌బర్గ్ ఆస్తుల విలువ 165 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 124 బిలియన్ డాలర్ల సంపదతో బిల్‌గేట్స్ 5వ స్థానంలో ఉన్నారని సీఎన్‌బీసీ పేర్కొన్నది.



చిలీలోని వినా డెల్ మార్‌లో రేగిన కార్చిచ్చులో తగలబడిపోతున్న ఇండ్లు, కార్లు

## చిలీలో కార్చిచ్చు బీభత్సం.. 64 మంది మృతి

న్యూఢిల్లీ: చిలీలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తున్నది. జన సాంద్రత ఎక్కువగా ఉండే సెంట్రల్ చిలీ చుట్టూ కార్చిచ్చు రగలడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బొరిక్ శనివారం రాత్రి టీవీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, సహాయక బృందాలకు సహకరించాలని సూచించారు. ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు చెప్తే, వెంటనే ఖాళీ చేయాలని ప్రజలను కోరారు. కార్చిచ్చు వల్ల దాదాపు 64 మంది మరణించినట్లు చెప్పారు. వల్పరైసో ప్రాంతంలో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. స్థానిక అధికారులు ప్రజలకు ఓ విజ్ఞప్తి చేశారు. కార్చిచ్చు రగులుతున్న ప్రాంతాలకు అగ్నిమాపక శకటాలు, అంబులెన్స్‌లు, అత్యవసర సేవల వాహనాలు చేరుకోవడం చాలా ఇబ్బందిగా ఉందని, ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని కోరారు. విల్లా ఇండిపెండెన్షియా ప్రాంతంలో ఇళ్లు, వ్యాపార సంస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కాలిపోయిన కార్లు వీధుల్లో వరుసగా కనిపిస్తున్నాయి.